ప్రజాశక్తి

శుక్రవారం 6 జనవరి 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

మంత్రి జోగి రమేష్, ఎంఎల్ఎ ఎం.జగన్మోహనరావు, ఎంఎల్‌సి మొండితోక అరుణ్‌కుమార్, నందిగామ ఎఎంసి ఛైర్మన్ మహమ్మద్ మస్తాన్, వైస్‌ఛైర్మన్ మురళిని గజమాలతో సత్కరిస్తున్న వైసిపి శ్రేణులు

అందరికీ భాగస్వామ్యం జగన్ ఘనతే

నందిగామ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి జోగి

ప్రజాశక్తి - నందిగామ : బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్‌గా మహమ్మద్ మస్తాన్, వైస్ ఛైర్మన్‌గా నల్లమల్లి మురళి, డైరెక్టర్లుగా 17 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా నందిగామ పురవీధుల్లో వైసిపి శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. వైసిపి కార్యాలయం వద్ద నుండి ఎన్‌టిఆర్ రోడ్డు,

(మిగతా 6లో)

చిత్తూరు కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్?

విఎంసి కమిషనర్‌గా చెరుకూరి కీర్తి !

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా వెళ్లే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గత రెండు రోజులుగా నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగుల్లో ఈ అంశంపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. ఆయన స్థానంలో విఎంసి కమిషనర్‌గా గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ చెరుకూరి కీర్తిని ప్రభుత్వం నియమించే అవకాశం ఉందని తెలిసింది. స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి సుమారు తొమ్మిది నెలలైంది. కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకొచ్చిన ఆయనను జిల్లాల పునర్విభజన తర్వాత ఉత్తరాంధ్రలోని ఏదో ఒక జిల్లాకు కలెక్టర్‌గా పంపవచ్చని నాలుగైదు నెలల క్రితమే చర్చ జరిగింది. అయితే పని పట్ల నిబద్ధతతోపాటు అటు అధికారులను, ఇటు ఉద్యోగులను పరుగులు పెట్టిస్తూ మంచి గుర్తింపు కలిగిన ఆయన అవసరం విజయవాడకు అవసరం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఇక్కడ ఉంచిందనే చర్చ కూడా లేకపోలేదు. 2016 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన స్వప్నిల్ దినకర్ కూడా ఏదో ఒక జిల్లాకు కలెక్టర్‌గా వెళ్లాలనే ఆలోచనతో పలు విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం ఆయనను కలెక్టర్‌గా నియమించవచ్చని తెలిసింది. ఈఅంశంపై కమిషనర్ స్వప్నిల్ దినకర్‌ను ప్రజాశక్తి పలకరించగా, 'నా కన్నా సీనియర్లు ఉన్నారు" అని చిరునవ్వుతో ముక్తాయింపు ఇచ్చారు.

ఎన్‌టిఆర్ జిల్లా తుది ఓటర్ల జాబితా వెల్లడి

- మొత్తం ఓటర్లు 16,31,883 మంది
- పురుషులు 8,00,770
- స్త్రీలు 8,30,958
- థర్డ్ జెండర్లు 155

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో 2023 జనవరి 1 నాటికి 16 లక్షల 31 వేల 883 మంది తుది ఓటర్లుగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో 8 లక్షల 770 మంది పురుషులు, 8 లక్షల 30 వేల 958 మంది స్త్రీలు, 155 మంది థర్డ్ జెండర్లు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు.నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలిలా ఉన్నాయి.

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్లు
తిరువూరు	1,00,054	1,16,053	08
విజయవాడ పశ్చిమం	1,20,460	1,21,670	34
విజయవాడ సెంట్రల్	1,30,698	1,35,752	60
విజయవాడ తూర్పు	1,32,145	1,35,989	20
మైలవరం	1,28,260	1,34,781	13
నందిగామ	0,94,429	0,99,728	09
జగ్గయ్యపేట	0,94,724	1,01,385	11

బరులకు రె..డీ

- సంక్రాంతి సంబరాల పేరుతో జూద క్రీడలకు ఏర్పాట్లు
- బరుల వద్దే మద్యం విక్రయాలు ?
- పోలీసులకు సవాలు విసురుతున్న పందెం రాయుళ్లు

కంచికచర్ల మండలంలో పొలాన్ని చదును చేసిన దృశ్యం

ప్రజాశక్తి - కంచికచర్ల, విజయవాడ రూరల్ : సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు నుంచే అధికార పార్టీ నేతలు జూద క్రీడలకు తెరతీస్తున్నారు. సంత్రాంతి సంబరాల పేరుతో ఇప్పటి నుండే కోడి పందేల బరులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కోడి పందేలే కాకుండా పేకాట, క్యాసినో వంటి వాటి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బరుల వద్దే మద్యం విక్రయాలకూ సన్నాహాలు చేస్తున్నారు. కంచికచర్ల మండలం కీసర, గండేపల్లి, పెండ్యాల, పరిటాల, గనిఆత్కూరు గ్రామాల పరిధిలో ఈ ఏడాదీ అధికార పార్టీ నేతల కన్నుసన్నల్లో బరులు సిద్ధమవుతున్నాయి. సంక్రాంతి వచ్చిందంటే ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు జూద క్రీడలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కంచికచర్ల మండలంలో రూ.150 కోట్లు చేతులు మారినట్లు అంచనా. జూదంలో నగదు పోగొట్టుకున్న కొందరి జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయి.

ఈ ఏడాది సంక్రాంతి పండుగకు సాంప్రదాయం పేరిట అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందిన గ్రామ స్థాయి నేతల దగ్గర నుండి మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధుల వరకు మూడు రోజులపాటు యధేచ్ఛగా కోడి పందేలు, పేకాట, గుండాట, పొట్టేళ్లు, లోన బయట లాంటి జూద క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మామిడి తోటలు, ఖాళీగా ఉన్న పొలాల్లో కోడి పందేలా బరులను సిద్ధం చేస్తున్నారు. బరుల వద్ద మద్యం విక్రయాలకూ సన్నద్ధమవుతున్నారు.

విజయవాడ రూరల్ మండలంలో ఎంపిక చేసుకున్న స్థలం

కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామ మామిడితోటల్లో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి కన్నుసన్నల్లో జూడ క్రీడలకు భారీ ఎత్తున అధునాతన హంగులతో బరులు సిద్ధం చేసినట్లు తెలిసింది. జూదరులకు బస ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిసింది.

రాజకీయ ఘర్షణలకు అవకాశం ?

కోడి పందేల బరుల వద్ద రాజకీయ ఘర్షణలు చెలరేగే ప్రమాదం పొంచి ఉంది. బరులు సిద్ధం చేస్తున్న పెండ్యాల, పరిటాల, కీసర, గండేపల్లి అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా పోలీసు రికార్డులో ఉన్నాయి. బరుల వద్ద మద్యం ఏర్పాట్లు కూడా చేస్తుండడంతో రాజకీయ పరమైన ఘర్షణలు చెలరేగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు. గత ఏడాది బరుల వద్ద టిడిపి, వైసిపి కార్యకర్తలు ఘర్షణలు పడి బాహాబాహీకి దిగారు. ఈ ఘర్షణల్లో ఇద్దరికి గాయాలు కూడా అయ్యాయి. పోలీసులు ముందస్తుగా మేల్కొని కోడి పందేల బరులను నిలువరించి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న విజయవాడ రూరల్ మండల గ్రామాల్లో సంక్రాంతికి కోడి పందేలు వేయలేదు. దీంతో పందేల రాయుళ్లు పొరుగు జిల్లాలకు వెళుతున్నారు. ఈనేపథ్యంలో పైస్థాయిలో ప్రజాప్రతినిధులపై

(మిగతా 6లో)

8న గ్రూప్ 1 స్క్రీనింగ్ పరీక్ష

- నగరంలో 13 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 6431 మంది అభ్యర్థులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ ఉదయం10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆఫ్‌లైన్, ఆబ్జెక్టివ్ విధానంలో నగరంలోని 13 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 6,431 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి జిల్లా స్థాయి సీనియర్ అధికారిని లైజన్ అధికారిగా నియమించామన్నారు. 13 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. పరీక్షల మెటీరియల్‌ను కేంద్రాలకు తరలించేందుకు వీలుగా లైజన్ అధికారులకు ఇద్దరు ఆర్మ్‌డ్ పోలీస్ పర్సర్లను నియమించాలని ఆదేశించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటోతో ఉన్న ఒరిజనల్ ఆధార్‌కార్డు, డ్రైవింగ్‌లైసెన్స్, ఓటర్‌కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, ఐడి గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పకుండా తీసుకురావాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలని, 9.45 తర్వాత, మధ్యాహ్నం పరీక్షకు 1.45 తర్వాత అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని పేర్కొన్నారు. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రానికి తీసుకురాకూడదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తహశీల్దార్లు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో ఇంటర్‌నెట్, జిరాక్సు సెంటర్లు మూసివేసేలా ఆదేశించామన్నారు. ఉదయం 8 నుండి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీనియర్ ఎఎన్ఎంలతో కూడిన మెడికల్ సిబ్బంది అత్యవసర మందులతో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు అధికారులతో సమన్వయం చేసేలా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, ఎసిపి ఎం.సత్తిబాబు, ఎపిపిఎస్‌సి కోఆర్డినేటర్ ఎస్ నాగూర్ షరీఫ్, జిల్లా లైజన్ అధికారులు, చీఫ్ సూపరిండెంటెంట్లు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో జిఓ ప్రతులు దగ్ధం

- మాజీ మంత్రి దేవినేని ఉమా అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-విజయవాడరూరల్ : జగన్‌రెడ్డి ప్రభుత్వం అర్ధరాత్రి చీకటి జీవోను చంద్రబాబు యాత్రలు, లోకేష్ యువగళంలను అడ్డుకోవడానికి తీసుకొచ్చిందని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడి లో జి. ఓ. నంబర్ 1 ప్రతులను దగ్ధం, ఆందోళన కార్యక్రమం గురువారం జరిగింది. ఆయన తోపాటు పార్టీ శ్రేణులు ప్రభుత్వం కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ లు భారీగా మోహరించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి ఉమా మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బ్రిటిష్ వారి కంటే దారుణంగా జగన్ పాలన చేస్తున్నారు. చివరకు ఒక ఎన్నారై కానుకలు ఇస్తే తగిన బందోబస్తును పెట్టలేకపోయారన్నారు. చంద్ర బాబుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి వైసిపి నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు.

అరెస్టును అడ్డుకున్న నేపథ్యంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - భవానీపురం : గొల్లపూడిలో దేవినేని ఉమా ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు జిఓ నెం1 ను రద్దు చేయాలని భారీ నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో గొల్లపూడిలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకోవటంతో దేవినేని ఉమా నివాసానికి భారీ ఎత్తున పోలీసులు చేరుకున్నారు. చీకటి జీవో కోసమే కందుకూరు, గుంటూరుల్లో 11 మందిని జగన్మోహన్ రెడ్డి చంపించారని తెదేపా శ్రేణులు పెద్ద ఎత్తున సీఎం డౌన్ డౌన్, చీకటి జీవో నెం.1ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. దీంతో దేవినేని ఉమాను ఇంటి బయటకు రాకుండా పోలీసులు చేరుకున్నారు. అయినా ఉమా బయటకు రావటంతో భవానీపురం సిఐ ఎం.డి. ఉమర్ నేతృత్వంలో సిబ్బంది దేవినేని ఉమాను బలవంతంగా జీపు ఎక్కించి గొల్లపూడి నుంచి భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో దేవినేని ఉమా అరెస్టును పార్టీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మందా మురళీమోహన్‌కు జీపు డోర్ తగిలి ముక్కుకు తీవ్ర గాయం కాగా, రాష్ట్ర టిఎన్‌టియుసి అనుబంధ విభాగ ప్రధాన కార్యదర్శి రెంటపల్లి శ్యామ్‌కు చేతి వేళ్ళకు గాయాలయ్యాయి. వీరు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. గురువారం సాయంత్రం 5.30 గంటల తర్వాత దేవినేని ఉమాను భవానీపురం పోలీసులు విడుదల చేశారు. **ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జగన్ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవులను వెనక్కు తీసుకోవాలని ప్రధాన కూడలి లో మెరుపు నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు పైడిమర్ల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చాట్ల చందా తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవో కోసమే 11 మందిని జగన్ చంపించాడు
టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చీకటి జీవో కోసమే కందుకూరు, గుంటూరుల్లో 11 మందిని జగన్మోహన్ రెడ్డి చంపించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఆరోపించారు. చంద్రబాబు కుప్పం పర్యటన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు టీడీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేపట్టారని తెలిపారు. ఈ క్రమంలో విజయవాడలో బుద్దా వెంకన్నను గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా గురువారం వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశలో వెంకన్న మాట్లాడుతూ చంద్రబాబుకు పెరుగుతున్న ప్రజా దరణ చూసి ఓర్వలేకే జగన్మోహన్ రెడ్డి తొక్కిసలాటలు సృష్టించి, 11 మంది మృతికి ప్లాన్ చేశారని తెలిపారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు సాదర బోయిన ఏడుకొండలు, కామా దేవరాజు, కొట్టేటి :హను మంతరావు, ఉమ్మడి చంటి, పేరాబత్తుల రమణ పాల్గొన్నారు.

జీవో ప్రతులు దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

రెడ్డిగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలో వత్సవాయి ఎండిఓ కార్యాలయం వద్ద పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా నూతనంగా మంజూరైన 279 పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు పెరిగిన 2750 రూపాయల మొత్తాన్ని శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ భాను మాట్లాడుతూ రాష్ట్రంలో పెన్షన్ల పండుగ వాతావరణం ఏర్పడిందని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, సర్పంచ్ భూక్య సీతమ్మ, ఎంపీపీ చెంబెటి వెంకటేశ్వర్లు, జడ్పిటిసి ఏసిపోగు దేవమని పాల్గొన్నారు.**ప్రజాశక్తి - రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్ లను జెడ్పిటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా,పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడున్నర సంవత్సరాల లో రెడ్డిగూడెం మండలంలో సుమారు మూడువేల కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, వైస్ ఎంపీపీ2 పాటిబండ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బలగాని తిరుపతిరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం :** స్థానిక ఎండిఓ కార్యాల యంలో గురువారం ఎంపీడీవో లక్ష్మి కుమారి అధ్యక్షతన నూతనంగా మంజూరైన పింఛన్లను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాటా ్లడుతూ అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్న రాణి, జెడ్పిటిసి సర్నాల.తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ అప్పిడి. సత్యనారాయణ రెడ్డి, పుల్లూరు పిఎ సిఎస్ అధ్యక్షులు రామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ వెంకటరావు,తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల హనుమాన్‌పేటలో 3 వ సెగ్మెంట్ పరిధిలో సీసీ రోడ్లు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతంలో సిసి రోడ్డు వేసినప్పటికీ చుట్టుపక్కల రోడ్లు మెరకగా ఉండటంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా హనుమాన్ పేట లోని సోమవరపు శ్రిరాములు ఇంటి వద నుండి సుమారు 100 మీటర్ల వరకు పల్లంగా ఉండటం తో వర్షం నీరు 2 అడుగుల మేర రోడుపై ప్రవహించేది. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, ఎంపిటీసి వేమా సురేష్ బాబు ఈ రోడ్డు దుస్తిపై ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మండల పరిషత్ నిధులు నుండి సుమారు 6 లక్షలు రూపాయలు కేటాయించారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, 2 కల్వర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

13 నుంచి జాతర ఉత్సవాలు

ప్రజాశక్తి - విజయవాడరూరల్ : రామవరప్పాడు లో వెంచేసిఉన్న శ్రీ వెంకమ్మ పేరంటాలు అమ్మ వారి దేవస్థానం లో సంక్రాంతి జాతర మహెూత్సవాలు ఈ నెల 13 నుంచి జరగనున్నాయని ఆలయ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఇ. ఓ లోకేశ్వరి, కమిటీ సభ్యులు ఉత్సవాల పోస్టర్ ను విడుదల చేశారు. సంక్రాతి సందర్భంగా అయిదు రోజు లపాటు ఉత్సవాలు జరగనున్నాయి. రంగులతో అమ్మవారి ఆలయం ముస్తాబు అయింది. ఆలయ చైర్మన్ బోయిన భాను, ఇ ఓ లోకేశ్వరి, పాలక మండలి సభ్యుల పర్యవేక్షణ లో ఆలయం సిద్ధం అవుతోంది. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు నూకల పుల్లయ్య, చైతన్య, అచ్చుతారావు, పద్మావతి, దుర్గారావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-వత్సవాయి : ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇళ్ల స్థలంతోపాటు ఇళ్లు నిర్మిస్తున్నారని శాసన సభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని లింగాల గ్రామంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించే ఇళ్ళ నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ కొత్తగా లింగాల గ్రామంలో 78 మంది ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా అందులో 60 మందికి పైగా ఇళ్ళ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. మిగతా లబ్ధిదారులు కూడా త్వరగా నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేయాలని తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు,డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, మాజీ సర్పంచ్ గుత్తా శంకర్రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండల కేంద్రం తరలింపు పై వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో 21వ రోజుకు చేరాయి.దీక్షలను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనెపూడి శంకర్ సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ తరపున దీక్షకు తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గం ఏరియా కార్యదర్శి చుండూరు సుబ్బారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి.రాజేంద్ర బాబు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, సిపిఐ విజయవాడ కార్యవర్గ సభ్యులు కొట్టు రమణ మద్దతు తెలిపారు. 21వ రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామానికి చెందిన గొల్లమూడి వెంకటేశ్వరరావు, వట్టికొండ రమేష్, తురక కోటేశ్వరరావు,నారుకొండ రమేష్, వట్టికొండ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన టీబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఉంటున్న రోగులకు పౌష్టికాహారాన్ని దాతల సహకారంతో సమకూరుస్తున్నామని హాస్పిటల్ సూపర్నిండెంట్ డాక్టర్ అల్లా హరీష్, టిబి సూపర్వైజర్ జి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా నలుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు మాసాల పాటు పోష్టికాహారాన్ని అందించనున్న కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాస్ రావు కు ఆయన కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-వత్సవాయి : ఉరి వేసుకుని బల వన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని సింగవరం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన సాయి భార్గవికి(32) సింగవరం గ్రామానికి చెందిన సింధు నరసింహారావుతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు వివాహమైన మొదటి నుండి వీరి కాపురంలో తరచూ గొడవలు అవుతూ సాయి భార్గవి తన పుట్టింటికి వెళుతూ ఉండేది. పలుమార్లు నరసింహారావును కుటుంబ సభ్యులు మద్యాన్ని మానేయమని పలుమార్లు హెచ్చరించినప్పటికీ తన వైఖరిని మార్చుకోలేదు.. వారి పిల్లలు ఇద్దరు పాఠశాలకు వెళ్లిన తర్వాత మద్యం మత్తులో ఉన్న తన భర్త భార్యతో వాగ్వివాదానికి దిగడంతో మనస్థాపానికి లోనై ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. నరసింహారావు వల్లే సింధు చనిపోయిందని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై అభిమన్యు తెలిపారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్లలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. స్థానిక నెహ్రూ సెంటర్, నంబూరు వారి వీధి, జుజ్జూరు రోడ్డులో ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు బుక్ లెట్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. నివేశన స్థలం, పక్కా గహాలు కోసం దరఖాస్తు చేసుకున్నా, మంజూరు కాలేదని పలువురు మహిళలు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

మట్టి తరలింపుపై రగడ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మైలవరం : అక్రమంగా నిలవ చేసిన చెరువు మట్టిని తరలించే విషయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది.ఈ ఘటనలో ఇద్దరుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం, వెల్వడం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గతాడాది గ్రామంలోని మోదుగుల చెరువు నుంచి అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు మట్టిని సమీప మామిడి తోటల్లో నిలువ చేశారు. ఆ మట్టిని సమీప గ్రామాల్లోని ఇటుక బట్టీలకు వైసిపి వెల్వడం గ్రామం మాజీ కన్వీనర్ రాంభూపాల్ రెడ్డి వర్గీయులు తరలిస్తున్నారు. వెల్వడం సొసైటీ అధ్యక్షుడు తిరుపతిరావు వర్గీయులు మట్టి తరలిస్తున్న లారీలను అడ్డుకున్నారు.దీంతో ఇరు వర్గాలకు మాట మాట పెరిగి కొట్లాటకు దారి తీసింది.ఈ సంఘటనలో వైసిపి నాయకుడు శీలం కష్ణారెడ్డి తలకు తీవ్ర గాయం అవ్వగా తిరుపతిరావు కూడా గాయపడ్డాడు. కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటన స్థలానికి ఎస్సై రాంబాబు చేరుకుని ఇవార్గాలను చెదరగొట్టారు. గాయపడిన ఇరువురిని 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుపతిరావు కష్ణారెడ్డిలకు ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో విజయవాడ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు తెలిపారు. గత ఏడాది చెరువు మట్టి తరలించే విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఒకరిపై ఒకరు ట్రాక్టర్లతో తొక్కించే ప్రయత్నం చేసుకున్నారు. ఎమ్మెల్యే వసంత కార్యాలయం వద్ద ఇరువర్గాలు భాహ బాహికీ దిగాయి. ఆ సంఘటన మరువక ముందే మరల రెండు వర్గాలు ఘర్షణలు పడ్డాయి.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణారెడ్డి

గ్రూప్‌-1 పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలి : డిఆర్‌ఓ

ప్రజాశక్తి-కలెక్టరేట్‌(కృష్ణా) : జిల్లాలో ఎపిపిఎస్సీ గ్రూప్‌-1 స్క్రీనింగ్‌ టెస్ట్‌ కట్టుదిట్టంగా నిబంధనల కనుగుణంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో స్పందన మీటింగ్‌ హాలులో ఎపిపిఎస్సీ అధికారులు, చీఫ్‌ సూపరింటెండెంట్లు లైజన్‌ అధికారులతో ఆర్వో సమావేశం నిర్వహించి పరీక్ష నిర్వహణపై నిబంధలు వివరించి పలు సూచనలు చేశారు. ఈ నెల 8వ తేదీ ఆదివారం ఎపిపిఎస్సీ గ్రూప్‌-1 స్క్రీనింగ్‌ టెస్ట్‌ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 9 గంటల నుండి 9.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారని మరో 15 నిమిషాలు గ్రేస్‌ పిరియడ్‌ ఉంటుందని తరువాత అనుమతి లేదన్నారు. అదే విధంగా మధ్యాహ్నం పరీక్షకు గంట ముందు అభ్యర్థులకు అనుమతి ఉంటుందన్నారు. సమయానికి ఇందుకోసం జిల్లాలో 6 మండలాల్లో 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, అవి మచిలీపట్నంలో 7 కేంద్రాలు, గుడివాడలో 6, ఉయ్యూరులో 2. పెనమలూరులో 2. గుడ్లవల్లేరులో -1, కంకిపాడులో -1 కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రూప్‌-1 స్క్రీనింగ్‌ టెస్టు, జిల్లాలో మొత్తం 7,627 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డిఆర్వో తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులు మొబైల్స్‌, క్యాలిక్యులేటర్స్‌, ఎలాంటి ఎలక్ట్రానిక్‌ పరికరాలను కూడా అనుమతించమని తెలిపారు. పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్‌ అమల్లో ఉంటుందన్నారు. సమావేశంలో ఎపిపిఎస్సీ అసిస్టెంటు సెక్రటరీ దేవేంద్రనాథ్‌, ఎస్వోలు బాబర్‌, ప్రతాప్‌, డిఎస్పి మహబూబ్‌ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు

మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు మురాల రాజేష్‌, ఆర్‌సిపి రెడ్డి తదితరులు

జిఓను వెనక్కి తీసుకోవాలి
సిపిఎం డిమాండ్‌

ప్రజాశక్తి - గుడివాడ

ముఖ్యమంత్రి వైయస్‌ జగన్మోహన్‌ రెడ్డి ప్రవేశపెట్టిన జీవో నెంబర్‌ 1 రద్దు చేయాలని, ఈ చీకటి జీవోను వెనక్కి తీసుకోవాలని సిపిఎం కార్యదర్శి కార్యవర్గ సభ్యులు మురాల రాజేష్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జీవో ప్రధానంగా రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, గ్రామస్థాయి రహదారుల్లో నిరసన కార్యక్రమాలు పెట్టకూడదనే విషయాన్ని తప్పు పట్టారు. గత ప్రభుత్వాలు ఇలా అనుకుంటే వైయస్‌ రాజశేఖర్‌ రెడ్డి వైయస్‌ జగన్మోహన్‌ రెడ్డి, షర్మిల పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చేవారా అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలో ప్రజలకు నిరసన తెలియజేసే హక్కు ఉందని కానీ ఆ హక్కును ప్రభుత్వం లేకుండా చేయడం దారుణం అన్నారు. ఇలాంటి ఓదార్పు యాత్రల వల్లే అధికారంలోకి వచ్చిన సంగతి మర్చిపోవడం హాస్యాస్పదమన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌ సి పి రెడ్డి మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని అవి జరగకుండా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. వెంటనే జీవోని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్‌ కమిటీ సభ్యులు రేపానికొండ, రజిని తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని పరిశీలించిన కలెక్టర్‌

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో సచివాలయం, పాఠశాలను జిల్లా కలెక్టర్‌ రంజిత్‌ బాషా గురువారం సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, స్పందన అర్జీల పరిష్కారం వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు లబ్ధిదారుల జాబితాలను జిల్లా కలెక్టర్‌ పి.రంజిత్‌ బాషా పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, ఆనీమియా నివారణకు చర్యలు గురించి ఆరా తీశారు. గుర్తించిన తక్కువ బరువు పిల్లలు, ఎత్తు తక్కువ పిల్లలకు అందిస్తున్న ఐరన్‌, ఫోలిక్‌ యాసిడ్‌ మాత్రలు గురించి ఆరా తీశారు. ప్రదర్శించిన వివిధ పథకాల లబ్ధిదారుల జాబితాలను కలెక్టర్‌ పరిశీలించారు. అనంతరం గ్రామంలో జడ్‌ పి పాఠశాలను సందర్శించి నాడు-నేడు పనుల పురోగతి ఆరా తీశారు. పనులు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్‌ త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో కిచెన్‌ తనిఖీ చేసిన కలెక్టర్‌ పరిశుభ్రత పాటించాలన్నారు. కోడి గుడ్లు సరఫరా గురించి ఆరా తీశారు. రోజుకు ఎంతమందికి భోజనాలు తయారు చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత జడ్పీ పాఠశాల ఆట స్థలం ఆవరణలో నిర్మాణంలో ఉన్న సచివాలయం ఆర్బీకే భవన నిర్మాణాలు కలెక్టర్‌ పరిశీలించారు. కోర్టు సూచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం జరుగుతుం

పాఠశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌

దన్నారు. అనంతరం కలెక్టర్‌ కొడాలి గ్రామంలో రైస్మిల్లు సందర్శించి సేకరించిన ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైస్‌ క్వాలిటీ, కెర్నల్‌ రేషియో, మిషనరీ వర్కింగ్‌, గోనె సంచుల రోటేషన్‌ గురించి కలెక్టర్‌ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ పి. రంజిత్‌ బాషా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ 50 శాతంపైగా పూర్తి అయిందని 2.25 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం ఇప్పటిదాకా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా నిబంధనలకు అనుగుణంగా తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామన్నారు. ఆర్డీఓ కిషోర్‌, డిఇవో తాహెరా సుల్తానా, డిఎస్వో వి.పార్వతి, సివిల్‌ సప్లయిస్‌ డిఎం శ్రీధర్‌, పంచాయితీరాజ్‌ ఎస్‌.ఈ వీరాస్వామి. జిల్లా వ్యవసాయాధికారి మనోహరరావు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ మీటింగ్‌ హాల్‌లో నూతనంగా పెన్షన్లు మంజూరైన అన్ని సచివాలయముల లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండల పరిషత్‌ అధ్యక్షులు కొడాలి సురేష్‌ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ యన్‌.టి.ఆర్‌ స్టేడియం వైస్‌ ఛైర్మన్‌ పాలేటి చంటి, మండల పరిషత్‌ ఉపాధ్యక్షులు శాయన పూర్ణ రవికుమార్‌, మండల పరిషత్‌ ప్రాదేశిక సభ్యులు శీరం రాధాకృష్ణవేణి, పెనుమల పూర్ణ కవిత పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్‌ : మచిలీపట్నంలో కోడిపందేలు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని బందరు డీఎస్పీ మాసూం బాష అన్నారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మచిలీపట్నం పోలీస్‌ సబ్‌ డివిజనులో ఎక్కడైనా కోడి పందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్‌ డివిజన్‌ పరిధిలో కోడి పందాలు నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఇప్పటికే 27కేసులలో 66 మందిపై బైండోవర్‌ కేసులు నమోదు చేశామన్నారు. మరి కొంతమంది నిర్వాహకులను బైండ్‌ ఓవర్‌ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాకుండా అసాంఘిక జూద కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై మరింత కఠినంగా చట్ట

ప్రకారం చర్యలకు ఉపక్రమిస్తామని తెలియ చేశారు. అంతేకాక సబ్‌ డివిజన్‌ పరిధిలో జనవరి 18 వరకు సెక్షన్‌ 30 పోలీస్‌ యాక్ట్‌ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించడం, నిరసన దీక్షలు, బహిరంగ ప్రదర్శనలు, ర్యాలీలు చేయడం నిషేధమని తెలిపారు. ఎవరైనా సబ్‌ డివిజనల్‌ పోలీస్‌ అధికారి ముందస్తు అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపడితే చట్ట ప్రకారము చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో మాత్రమే జరుపుకో వాలని చెప్పారు. కొంతమంది చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, అసాంఘిక చర్యలు అయిన జూద క్రీడలు, కోడి పందాలు వాటి నిర్వహణకు బరులు సిద్ధం చేయడం, పేకాట, గుండాట, లాటరీ వంటి క్రీడలకు పాల్పడిన, నిర్వహించిన, నిర్వహించే వారికి సహకరించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని వివరించారు. ఈ సమావేశంలో గన్నవరం సీఐ కెవివిఎస్‌. సత్యనారాయణ, క్రైమ్‌ ఎస్‌ఐ భాషా పాల్గొన్నారు.

పండుగ పేరుతో పేకాటలొద్దు : డిఎస్‌పి

ప్రజాశక్తి-గన్నవరం : సంక్రాంతి పండుగ సందర్భంగా గన్నవరం సబ్‌ డివిజన్‌ పరిధిలో ఎవరైనా కోడిపందాలు, పేకాట , గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ విజయపాల్‌ హెచ్చరించారు. గురువారం గన్నవరం స్టేషన్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ

గన్నవరంలో మాట్లాడుతున్న డీఎస్పీ విజయపాల్‌

దౌర్జన్యం కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-గన్నవరం : విశేషర్‌ కళాశాల రిటైర్డ్‌ ప్రిన్సిపాల్‌ స్వర్ణకుమారికి చెందిన స్థలాన్ని కబ్జా చేయడమేకాక అదేమని అడిగిన వారిపై దౌర్జన్యం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో గన్నవరం శ్రీనగర్‌ కాలనీకి చెందిన రౌడీషీటర్‌ మండవ వెంకటేశ్వరరావుకు ఆరు నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ 12 ఎం.ఎం కోర్టు న్యాయమూర్తి బి. శిరీష గురువారం తీర్పు చెప్పారు. గన్నవరం శ్రీనగర్‌ కాలనీకి చెందిన డాక్టర్‌ మద్దుకూరి విజయ్‌ కుమార్‌ సతీమణి స్వర్ణ కుమారికి 14 వ వార్డు ఏరియాలో 15 సెంట్లు స్థలము ఉంది. సదరు భూమిని మండవ వెంకటేశ్వరరావు కబ్జా చేయడానికి ప్రయత్నించడమే కాక ఆ భూమిలో ఉన్న ఆస్తులలో తన అన్యాయులతో కలిసి ధ్వంసం చేయడంపై పోలీస్‌ స్టేషన్లో అప్పట్లో ఫిర్యాదు నమోదయింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ తరపున ఏపీపీ ప్రసన్న వాదించారు. సదరు కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష పడింది.

బాలింత మృతి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్‌ : మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉయ్యూరుకు చెందిన నాగమణి (23) అనే ఓ బాలింత గురువారం అస్వస్థతతో మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. బుధవారం ఉదయం ఆపరేషన్‌ చేయగా నాగమణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డకు జన్మనిచ్చి 24 గంటలు గడవకముందే మత్యువడికి చేరుకుంది. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే నాగలక్ష్మి మతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. మతురాలి బంధువులు, వైద్యులకు మధ్య కొంత ఘర్షణ జరిగి స్వల్ప ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. న్యాయం జరిగేవరకు మతదేహాన్ని తీసుకెళ్లేది లేదని, వైద్యుల నిర్లక్ష్యంపై అధికారులు వచ్చి సమాధానం చెప్పి న్యాయం చేయాలని మతురాలి బంధువులు కోరారు. డాక్టర్ల నిర్లక్ష్యం కాదని అస్వస్థతతో ఆమె చనిపోయిందని సీనియర్‌ వైద్యులు మతురాలి కుటుంబ సభ్యులను సముదాయించారు. చేసేది లేక కుటుంబసభ్యులు మతదేహంతో గ్రామానికి వెనుదిరిగారు.

తంబి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - ఉంగుటూరు : బ్రదర్‌ జోసఫ్‌ తంబి నవదిన ప్రార్థనల్లో భాగంగా గురువారం రెవ. ఫాదర్‌ అల్లంబాల పూజా బలిని సమర్పించారు. పుణ్య క్షేత్ర రెక్టర్‌ ఫాదర్‌ సుధాకర్‌ లారెన్స్‌ పూజా విన్నపాలను చదివారు. 'నిరీక్షణ క్రైస్తవ జీవిత సత్యము' అను అంశంపై బోధించారు. జోసఫ్‌ తంబి తన జీవితంలో, తన జీవిత ధ్యేయం పట్ల, నిరీక్షణ కలిగి జీవించారని తెలిపారు. మన జీవితం, ఈ లోకంలో ముగియదని, పరలోక జీవితం కొరకు మనమందరం నిరీక్షణతో చూడాలని తెలిపారు. తంబినగర్‌, పెద్ద అవుటపల్లి సంఘస్తులు, పోపుగారు, మేత్రాణులు, గురువులు, కన్యాస్త్రీలపై కరుణ చూపించాలని ప్రత్యేకముగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో, మేరీమాత ప్రావిన్స్‌ వైస్‌ ప్రొవిన్షల్‌ ఫాదర్‌ బసంత్‌, విచారణ కర్తలు మరియన్న కొమ్ముకూరి, సహాయక గురువులు ఆదూరి శౌరెడ్డి, ప్రవీణ్‌ గోపు, ఆరోక్యరాజు, ఫాదర్లు నామదేవ్‌, కిషోర్‌, సంఘస్తులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ రూపుమాపేందుకే
కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-పెదపారుపూడి

దళారీ వ్యవస్థను రూపుమాపాడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని తహసీల్దార్‌ వి. నాగభూషణం అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న సిబ్బంది ఎవరైనా దళారులతో కలిసి ఎటువంటి లావాదేవీలు నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారు పండించిన ప్రతి గింజను ధాన్యం కొనుగోలు ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. మిల్లర్లు గాని కొనుగోలు సిబ్బంది గాని రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ ఐ మౌని వీఆర్వో ప్రసాద్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జోగి

ప్రజాశక్తి-నందిగామ: ఉచిత కోచింగ్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని, నిరుద్యోగులు తమ కలను సాకారం చేసుకోవాలని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ నందిగామలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను మంత్రి గురువారం సందర్శించారు. నూతన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. నిరుద్యోగులు, విద్యార్థుల బంగారు భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సొంత నిధులతో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆగ్రో డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, జడ్పిటిసి అమర్లపూడి కీర్తిసౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, అధ్యాపకులు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నందిగామలో ఆయుష్ క్లినిక్ అండ్ స్టోర్స్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: 23వ డివిజన్ సివిఆర్ హై స్కూల్‌లో నాడు-నేడు పనుల క్రింద రూ.150 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మాణం పూర్తయిన భవనాన్ని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పలు ఆధునీకరణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యాత ప్రమాణాలు ఉంటేనే గుత్తేదార్లకు బిల్లులు చెల్లిస్తామని కమిషనర్ తెలిపారు. అనంతరం 62 , 64వ డివిజన్లలో డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ గురునాథ్, ఇతర అధికారులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అసమానతలు తొలగించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-నందిగామ: ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు విధానంలో జరుగుతున్న అసమానతలను తొలగించి,

పిల్లల ఉన్నచోట ఉపాధ్యాయులు ఉండాలని కోరుతూ నందిగామ డివైఈవో, మండల విద్యాశాఖ అధికారి బాలాజీకి యుటిఎఫ్ నాయకులు గురువారం వినంతిపత్రం అందజేశారు. గత రెండు సంవత్సరాల నుంచి జడ్పీహెచ్ఎస్ పెద్దవరంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చాలా ఒత్తిడి గురవుతున్నారని, ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా యుటిఎఫ్ ట్రెజరర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి చిన్నం నరసింహారావు, కోశాధికారి గడ్డం లక్ష్మీనారాయణ, కోటేశ్వరావు పాల్గొన్నారు.

నిమ్రాలో జాతీయ వెబినార్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే అంశంపై జాతీయ వెబినార్ నిర్వహించారు. ఈ వెబినార్‌లో ముఖ్య వక్తగా ప్రాఫిన్‌టెక్ వ్యవస్థాపకులు మరియు సీఈవో రవి తన్నీరు పాల్గొని మాట్లాడుతూ నూతన టెక్నాలజీను ఆధార్ ద్వారా బ్యాంకు నగదు బదిలీ యూపిఐ మరియు రానున్న రోజుల్లో ఆటోమేషన్ విభాగంలో ఫైనాన్స్ ఉత్పత్తులు మరియు ఉద్యోగ అవకాశాలు అనే వివిధ అంశాలపై క్షుణ్ణంగా ప్రసగించారు. విద్యార్థులు నైపుణ్యం కోసం ఎటువంటి స్కిల్స్ పెంపొందించుకోవాలో వివరించారు. ఈ వెబినార్‌లో నిమ్రా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ తమ్మినైన నారాయణమూర్తి, డాక్టర్ అక్బర్‌ఖాన్, అబ్దుల్ బాజీ , వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి- తిరువూరు: స్థానిక శ్రీనిధి హైస్కూల్లో తిరువూరు ఎల్ఐసి బ్రాంచ్ ఆధ్వర్యంలో 6 నుంచి 10 తరగతి వరకు విద్యార్థులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బ్రాంచ్ మేనేజర్ శివశ్రీ, డెవలప్‌మెంట్ ఆఫీసర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ ఆర్.వెంకటనారాయణ, అకడమిక్ ఇన్‌ఛార్జ్ పి.నరేంద్ర పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహం

సిడ్బీ స్వావలంభన్ మేళా ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కోవే (కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌పెన్యూర్ ఆఫ్ ఇండియా) ప్రధాన ఉద్దేశమని కోవే జాతీయ అధ్యక్షులు మధు త్యాగి అన్నారు. కోవె-సిడ్బీ సంయుక్త ఆధ్వర్యంలో వేదిక కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సిడ్బీ స్వావలంభన మేళాను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలకు తగిన విధంగా ప్రోత్సాహం అందించి వారిని వ్యాపార రంగాలలో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడంతో పాటు వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడమే కోవే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మహిళలతో తాము నిర్వహించే అన్ని కార్యక్రమాలకు సిడ్బీ (స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. సిడ్బీ డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సిడ్బీ చిన్న, కుటీర పరిశ్రమలకు తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కోవే ఎపి ఛాప్టర్ అధ్యక్షులు రాధిక మాట్లాడుతూ విజయవాడ నగరంలో మూడు రోజుల పాటు స్వావలంభన్ మేళా నిర్వహిస్తున్నామని, మహిళా ఉత్పత్తులకు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని అన్నారు. మేళా ఈ నెల 7వ తేదీ వరకు ఉదయం 10 నుండి సాయంత్రం 8 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిడ్బీ ఎజిఎం సేగు సుకుమార్, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ విజయశ్రీ, కోవే నేషనల్ జాయింట్ సెక్రటరీ అపర్ణ, సెక్రటరీ విజయలక్ష్మి, సెక్రటరీ-1 మోహిని, జాయింట్ సెక్రటరీ మాలతి, ట్రెజరర్ శ్రావణి జెట్టి, పాస్ట్ ప్రెసిడెంట్ రాజామణి, కమిటీ సభ్యులు సత్యవతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయు దీక్ష

ప్రజాశక్తి-విజయవాడ: ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పిఎన్ బస్‌స్టేషన్ వద్ద గురువారం రిలే నిరాహారదీక్ష చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ప్రమోషన్స్‌ను కల్పించాలని, ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలని కోరుతూ యూనియన్ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రిలే దీక్ష అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఎం ఎంవైదానంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానుద్దేశించి అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, సిసిఎస్ పాలకమండలి సభ్యులు కెఎవి శ్రీనివాసరాజు మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతంచేస్తామని హెచ్చరించారు. సత్వరమే ఉద్యోగుల సమస్యలను చర్చించడానికి ఆర్ఎం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, ఆయా సంఘాల నేతలతో చర్చించాలని కోరారు. జోన్‌లో ఎడి, పిడి, ఒపడి, ఎన్‌పిడి విభాగాల్లో ప్రమోషన్లు ఇవ్వనందున సిబ్బందిలో తీవ్ర నిరాశ, నిస్పృహలు ఏర్పడ్డాయన్నారు. సంస్థలోని ఖాళీలను ప్రమోషన్స్ ద్వారా భర్తీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్‌లో బదిలీ విధానాన్ని పారదర్శకంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని, దీనికి విరుద్ధంగా ఇచ్చిన బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు డివి రావు అధ్యక్షత వహించగా, ఎస్‌రాజేష్‌కుమార్, జోనల్ కార్యదర్శి ఎవి రామారావు, నాయకులు ఎన్‌విఆర్ బాబు, సహెచ్ రామకృష్ణారావు, కె రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీలో ఆర్‌సిఎం కాలనీకి చెందిన సెంట్రింగ్ మేస్త్రి అందుగుల జాన్‌కిషోర్ అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబానికి ఎన్టీఆర్ జిల్లా కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఇబ్రహీంపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు జానేష్, కొప్పుల కుమార్, టి సాంబశివరావు, చిట్టిబాబు, బుల్లికిరణ్ పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ వాహనాలను ఈ నెల 12న ఉదయం పది గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు భవానీపురం సిఐ ఎం.డి.ఉమర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా పది శాతం జియస్‌టి రుసుము కట్టాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం భవానీపురం పోలీస్‌స్టేషన్ హెచ్‌సి ఎన్.బాలయ్య 9490964949, ఎఎస్ఐ పి.శ్రీనివాసరావు 9951343344లను సంప్రదించాలని కోరారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వాసవి క్లబ్ ఆనందవనం, వాసవి క్లబ్ నందనవనం, వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మిట్టగూడెంలోని డంగుమిల్లు రోడ్డులో గల నిరుపేద మహిళలకు చీరలను అన్నపూర్ణ సేవా సమితి వ్యవస్థాపకులు మహంకాళి జయప్రకాష్, జగ్గయ్యపేట మీడియా అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకరపర్తి వెంకట రమేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దుల ఉమా, యన్నా కుల మణికంఠ, తుమ్మలపుడి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కమిషన్ సభ్యులు పుల్లారావు పర్యటన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు కాలే పుల్లారావు గురువారం పట్టణంలో పర్యటించారు. పట్టణ మున్సిపాలిటీ ఆవరణలో షెడ్యూల్ కులాల సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగా ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఎస్సీలకు శ్మశానవాటికలు లేనటువంటి గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లోని జనాభా ప్రాతిపదికపై శ్మశానవాటికకు స్థలాలు కేటాయించడం జరిగిందని అన్నారు. గ్రామాల్లో శ్మశానవాటిక లేని గ్రామాలు గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని, ఆ దరఖాస్తును పరిశీలించి శ్మశానవాటికు స్థలాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో ఎస్సీలకు కల్యాణ మండపం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని, నామినేట్ పదవుల్లో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానం చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక

వర్గానికి కేటాయించాలని, ఎస్సీలకు రద్దు చేసిన 27 పథకాలు తక్షణమే పునరుద్ధరించాలని బహుజన సమాజ పార్టీ రాష్ట్ర నాయకులు కొదమల్ల ప్రభుదాస్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఎస్సీ నాయకులు వేల్పుల రవికుమార్, బూడిద నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

౭ నుండి నాస్తిక మహాసభలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నాస్తికోద్యమ నిర్మాత, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు గోరా 120వ జయంతి, సరస్వతీ గోరా 110వ జయంతి సందర్భంగా నగరంలోని నాస్తిక కేంద్రంలో ఈ నెల 7 నుండి మూడు రోజుల పాటు నాస్తిక మహాసభలు జరగనున్నాయని నాస్తిక కేంద్రం చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద గల నాస్తిక కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మతశక్తులు, అభివృద్ధి నిరోధక శక్తుల వల్ల మానవత్వం మరుగునపడి, మారణహోమం జరిగేందుకు అవకాశం ఉందన్నారు. ఇటువంటి ప్రమాద పరిస్థితుల్లో గోరా ప్రతిపాదించిన పాటిజివ్ ఎథీజం ఒక్కటే మార్గమన్నారు. గోరా సూచించిన ప్రతిపాదనలు తెలియచేసేందుకు ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈసభలకు వివిధ దేశ ప్రతినిధులు, భారతదేశంలోని 28 రాష్ట్రాల నుండి ప్రతినిధులు, నాస్తికులు, అభ్యుదయవాదులు పాల్గొంటారన్నారు. మహాసభలు 7వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని, తమిళనాడుకు చెందిన మోడరన్ రేషనలిస్టు పత్రిక జాయింట్ ఎడిటర్ కుమరేశన్ ప్రారంభిస్తారని తెలిపారు. 7వ తేదీ సాయంత్రం మహాత్యాల గుట్టు రట్టు చేస్తూ హేతువాది

డాక్టర్ నరేంద్రకుమార్ మ్యాజిక్ ప్రదర్శన ఉంటుందన్నారు. 8వ తేదీ ముగింపు సభ ఉంటుందని, 9వ తేదీన నాస్తిక కేంద్రానికి సంబంధించిన వివిధ కార్యక్రమాల సందర్శన కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మారు, నియంత, రశ్మి సమరం, సకల, శ్రీహరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాశక్తి

జిల్లా వార్తలు 5

శుక్రవారం 6 జనవరి 2023

జిఒ 1ని నిరసిస్తూ టిడిపి ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సభలు, సమావేశాలు, రోడ్‌షోలను బహిరంగ ప్రదేశాల్లో నిషేధిస్తూ రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1ని నిరశిస్తూ టిడిపి ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి.

గన్నవరం : నేరాలను కప్పి పుచ్చుకునే కుట్రలో

అవనిగడ్డలో

గన్నవరంలో

నాగాయలంకలో

గుడివాడలో

భాగంగానే వైసిపి ప్రభుత్వం జీవో నం.1న తెచ్చిందని శాసనమండలి సభ్యుడు, టిడిపి ఇన్‌ఛార్జి బచ్చుల అర్జునుడు విమర్శించారు. కుప్పంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రోడ్‌షోను పోలీసులు అడ్డుకున్న నేపథ్యంలో తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ గన్నవరం నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకూ టిడిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. జీవో నం.1 ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు,రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, మండల పార్టీ అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు, దయాల రాజేశ్వరరావు, ఆరుమల్ల వెంకట కృష్ణారెడ్డి, గొడ్డళ్ళ చిన్న రామారావు, గన్నవరం టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శులు బోడపాటి రవికుమార్, కోనేరు సందీప్ తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** నాగాయలంక మండలం భావదేవరపల్లి పంచాయతీ కుమ్మరి పాలెం గ్రామంలో ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం జరిగింది. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, అవనిగడ్డ నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు బావిరెడ్డి వెంకటేశ్వరరావు, భావదేవరపల్లి గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మాజీ ఎంపిటిసి బోండాడ గణపతిరావు, గ్రామ ఉప సర్పంచ్ నల్లూరి శ్రీనివాసరావు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కూనపరెడ్డి నాగమల్లేశ్వరావు, ఆవుల వెంకటకృష్ణారావు కుమ్మరి పాలెం పెద్దలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జరగబోయే నిరసన కార్యక్రమానికి వెళ్లనీయకుండా తలశిల స్వర్ణలతను గృహనిర్బంధం చేశారు

గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం అర్ధరాత్రి తీసుకొచ్చిన జీవో 1ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తెలుగు మహిళా నాయకులు అసిలేటి నిర్మల, సిరిపురపు తులసీరాణి, మదాల రోజాలు పారిశుధ్య కార్మికులతో కలిసి వినూత్నంగా గురువారం స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** జీవో 1ని రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ టిడిపి ఆధ్వర్యంలో అవనిగడ్డ లోని పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి ప్రధాన సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జీవో కాపీలను దగ్ధంచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, ఘంటసాల రాజమోహనరావు గుంటూరు వినయ్, దాసినేని శ్రీనివాసరావు, బర్మా శ్రీనివాసరావు, కొల్లూరి ఇమ్మానియేల్, మొగల్ మురాద్, యలవర్తి చిన్న, చందు, గాంధీ, రేపల్లె అంకినీడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నిరసన

అవనిగడ్డ : ప్రతిపక్షాల గొంతు నొక్కడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 1ని తక్షణమే రద్దు చేయాలని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులపై జీవోల రూపంలో భంగం కల్గించటం సిగ్గుచేటన్నారు.

ప్రాథమిక హక్కులను హరించొద్దు

అఖిలపక్షం ధర్నా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కూడళ్లలో సభలు, సమావేశాలు, రోడ్ షోలు నిషేధిస్తూ ఇచ్చిన జీవో 1ని వెంటనే

గుడ్లవల్లేరులో

ఉపసంహరించాలని కోరుతూ ప్రజాసంఘాలు, అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం గుడ్లవల్లేరు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహించుకోవటం ప్రజాస్వామ్య రాజ్యాంగ హక్కు అని పేర్కొన్నారు. దానిని నిరాకరిస్తూ రాష్ట్రప్రభుత్వం నిరంకుశంగా పరిపాలించాలని భావిస్తోందన్నారు. బిఎస్‌పి మండల అధ్యక్షుడు దారం నిరంజన్ మాట్లాడుతూ అన్ని ప్రజా సంఘాలు, పార్టీలన్నీ ఏకం కావాలని కోరారు. జనసేన దళిత విభాగం అధ్యక్షులు కళ్లెవరపు రంగారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవలని కోరారు. సిఐటియు అనుబంధ ప్లంబర్స్ యూనియన్ అధ్యక్షులు బొగ్గవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసంఘాలు కూడా గొంతు కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అన్వర్ భాష, బార్బర్స్ యూనియన్ నాయకులు ఆర్.రాఘవులు, బడ్డయ్య రావాడ గోపాల్ మేస్త్రీ, చిన్ని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15 వరకూ ఇకెవైసి నమోదుకు అవకాశం

గన్నవరం ఎడిఎ సునీల్

ప్రజాశక్తి-పమిడిముక్కల

2022-23 సంవత్సరానికిగాను రబీ సీజన్‌కు ఈ-క్రాప్ బుకింగ్‌కు ఈనెల 15వ తేదీ వరకూ గడువు ఉందనీ, నమోదును వేగవంతం చేయాలని గన్నవరం ఎడిఎ సునీల్ కోరారు. పమిడిముక్కల మండలంలోని లంకపల్లి, కృష్ణాపురం రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాఫ్ నమోదుపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుతడి పంటలుగా వేసిన మినుముతో పాటు ఇతర పంటలను నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవటానికి ఈనెల 15వ తేదీ వరకు గడువును రాష్ట్రప్రభుత్వం పొడిగించిందన్నారు. మినుము, మొక్కజొన్న సాగుచేస్తున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ క్రాఫ్‌లో పంటల వివరాలను నమోదు చేయటం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. పంటలు నష్టపోతే బీమా పరిహారం అందుతుందని వివరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఎడిఎ సునీల్

వాలంటీర్ల సేవలు దేశానికి ఆదర్శం

బుక్‌లెట్‌ను అందజేస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల ఇంటికే చేరుతున్నాయనీ, సహకరిస్తున్న సచివాలయ వాలంటీర్ సేవలు దేశానికే ఆదర్శనీయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రశంసించారు. గురువారం అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీ, ఏకలవ్య నగర్, బందలాయి చెరువు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గతంలో ఏ పని కావాలన్నా మండల పరిషత్, ఇతర కార్యాలయాలు చుట్టూ రోజులు తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఇంటి దగ్గరే ఉండి అని పనులు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు ఆమనగడ్డ స్వర్ణకుమారి, కో ఆప్షన్స్ సభ్యులు, ఉప సర్పంచ్ గాజుల జై గోపాల్, వార్డు సభ్యులు మురుగు మల్లేశ్వరి, పార్టీ నాయకులు చింతలపూడి బాలు, మేడికొండ సంతోషరావు, గార్లపాటి గోపి, శివాలయం చైర్మన్ సింహాద్రి రామనాథం బాబు, పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ఉయ్యూరు : పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్పులు అందజేయడం ద్వారా వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం అందజేస్తున్న నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షకు స్టడీమెటీరియల్ అందజేయడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఐ.పద్మారాణి, ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కుమారుడు అలీన్, కుమార్తె క్యూరీ ఆధ్వర్యంలో ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ -2023 పరీక్షకు హాజరయ్యేందుకు 8,9 తరగతుల విద్యార్థులకు గురువారం స్టడీమెటీరియల్ అందజేశారు. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశామని యుటీఎఫ్ ఉయ్యూరు మండల శాఖ అధ్యక్షుడు పీవీ రమణ అన్నారు. ప్రధాన కార్యదర్శి మోకా మాధవరావు, జిల్లా కౌన్సిలర్ కే శ్రీనివాస్ సహాధ్యక్షురాలు టి.స్వర్ణకుమారి, ఆడిట్ కమిటీ కన్వీనర్ వి.మాధవీలత, కార్యదర్శులు ఎం.బాబు, హిరామ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీలో నాయకులు

ఉపసంహరించుకోకపోతే ఉద్యమం : సిపిఎం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్రంలో రోడ్డు షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జీవో 1ని తక్షణమే

మచిలీపట్నంలో

ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కోనేరు సెంటర్లో జీవో 1ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవోతో ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛపై చేస్తున్న దాడిగా అభివర్ణించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ ఈ జీవో అమలు వల్ల ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్ర వాదుల నోరునొక్కటమే అవుతుందన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ మాట్లాడుతూ ప్రజలు తమ హక్కుల కోసం ఆందోళన చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల యంత్రాంగం అడ్డుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు సిహెచ్ జయ రావు, ఎండి యూనస్, ఈడే రామారావు, కే.అంబా ప్రసాద్, ముఠా యూనియన్ నాయకులు జొన్నలగడ్డ నాగ శివ, కార్యదర్శి గోళ్ళ చంటి పాల్గొన్నారు.

లెమన్ ట్రీ హోటల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

6న రీజనల్ రెవెన్యూ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - విజయవాడ

కోస్తాంధ్ర జిల్లా కలెక్టర్లతో ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక లెమన్ ట్రీ హోటల్‌లో జరిగే రెవెన్యూ శాఖ సదస్సు ఏర్పాట్లను గురువారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖల మంత్రి ధర్మాన ప్రసాదరావు, సిసిఎల్‌ఎ ఉన్నతాధికారులు, కోస్తాంధ్ర కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులు, డివిజనల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. భూముల రీసర్వే, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

నీటి మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - విజయవాడ : మధురానగర్ ఇందిరా కాలనీ రామాలయం వీధిలో నీటి మీటర్లకు వ్యతిరేకంగా కాలనీ పెద్దలు, స్థానికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు కష్ణమూర్తి మాట్లాడుతూ మధురానగర్ పసుపుతోట ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి మీటర్లకు వ్యతిరేకంగా నిరసన కొనసాగుతోందన్నారు. ప్రజలపై భారం మోపే నీటి మీటర్లను నిలువరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కే కూర్మయ్య, ప్రదీప్, యుగంధర్, రమాదేవి, రమ్య, రత్న తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఖాదర్ బాషాకు కేబినెట్ హోదా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వక్ఫ్ బోర్డు చైర్మన్ వి.ఖాదర్ బాషాకు కేబినెట్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఖాదర్ బాషాను రెండోసారి కొనసాగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో తాజాగా బాషాకు కేబినెట్ హోదా కల్పించారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. క్యాబినెట్ హోదాతో సమకూరే ప్రొటోకాల్ సదుపాయాలన్నీ బాషాకు వర్తించనున్నాయి.

8 వరకు సచివాలయాల్లో పొదుపు సంఘాల ఖాతాల వివరాలు ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు 2019 ఏప్రిల్ 11వ తేదీనాటికి ఉన్న స్వయం సహాయక సంఘాల బ్యాంకు రుణాల అప్పు నిల్వ మొత్తం సొమ్మును 4 విడతల్లో నేరుగా ఆయా సంఘాల పొదుపు ఖాతాలకు జమ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 2 విడతల ఆసరా సొమ్మును నేరుగా ఆయా సంఘాల పొదుపు ఖాతాలకు జమ చేశారు. ఈ ఏడాది వైఎస్ఆర్ ఆసరా 3వ విడత మంజూరుకు అర్హత గల సంఘాల జాబితాను సోషల్ ఆడిట్‌లో భాగంగా అన్ని వార్డు సచివాలయాల్లో ఈనెల 3 నుండి 8వ తేదీ సాయంత్రం వరకు ప్రదర్శిస్తున్నారు. వీటిలో సంఘాల పొదుపు ఖాతా వివరాల్లో ఏమైనా మార్పులుంటే విజయవాడ నగర పాలక సంస్థ యుసిడి విభాగం కార్యాలయంలో సమర్పించి సరిచేసుకోవాలని ప్రాజెక్ట్ ఆఫీసరు కోరారు.

జిఒ 1ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతి ప్రక్షాల గొంతునొక్కే బ్రిటిష్ కాలం నాటి ఉత్తర్వులు రద్దు చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎస్‌సి సెల్ దళిత రత్న పరిశపోగు రాజేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ర్యాలీలు, సభలు సమావేశాలు నియంత్రణకు జారీ చేసిన జీవో 1ను ప్రభుత్వం వెంట నే ఉపసంహరించుకోవాలని కోరారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఖమ్మం గారి కోర్టు నందు
ఒ.యస్. నెం. 362/2017

బిట్వీన్ :
తూము రాధాకృష్ణ .. ప్లెయింటిఫ్
మరియు
కడియాల పూర్ణచందర్‌రావు డిఫెండెంట్

నోటీసు

టు,
కడియాల పూర్ణచందర్‌రావు, తండ్రి : తిరుమలయ్య, వయస్సు : 40 సం.లు, వృత్తి : వ్యాపారం, నివాసం : పాతర్లపాడు గ్రా॥, గంపలగూడెం మం॥, కృష్ణా జిల్లా.

పైన తెలిపిన నెంబరు గల కేసులో ప్లెయింటిఫ్ మీపై రికవరీ ఆఫ్ మనీ కేసు వేసి వున్నారు. పై కేసులో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను ముట్టనందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయునది. ది. 31.01.2023న వాయిదా కలదు. కావున **ది. 31.1.2023న ఉ.గం. 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వులతో//
అనంచిన్ని రామారావు
అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9848468711

ప్రకటన

నా క్లయింట్ మరియు యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ కాపురస్తులు అయిన కుప్పుస్వామి గారి కుమారుడు శ్రీ తాండవ రాజేష్ గారి యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా, సర్దార్. రాంపిళ్ళ సూర్యనారాయణ గారి శ్రీమతి అయిన రాంపిళ్ళ నర్సయమ్మ గారు మరియు వీరి కుమారులు వారి తాలూకు ఈ దిగువ తెలిపిన ఎ-షెడ్యూలాస్థిని ది.21-05-1951 న విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన తేదిన రిజిష్టరు కాబడినట్టి సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.1145/1951 ద్వారా పొందియున్నారు. సదరాస్థిని డెవలప్‌మెంట్ చేయదలచి వారికి తగినంత అనుభవం లేనందున శ్రీ గోళ్ళ కృష్ణమూర్తి గారి కుమారుడు శ్రీ గోళ్ళ నారాయణరావు గారిని పైన తెలిపిన వారు వారి బిల్డరుగా నియమించుకుని ది.07-09-2012న డెవలప్‌మెంట్ అగ్రిమెంటు కమ్ జి.పి.ఎ. ను వ్రాయించి శ్రీ విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో నెం.5995/2012 ను రిజిష్టరు చేయించి యున్నారు. మరియు సదరు డెవలప్‌మెంట్ అగ్రిమెంటు కమ్ జి.పి.ఎ.కు అనుబంధ దస్తావేజును కూడా వ్రాయించి ది.22-03-2014 వ తేదిన శ్రీ విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో నెం.3601/2014 రుగా రిజిష్టరు చేయించి యున్నారు. సదరు దస్తావేజులకు సంబంధించి ఈ దిగువ తెలిపిన షెడ్యూలాస్థి పైన తెలిపిన శ్రీ గోళ్ళ. నారాయణరావుగారికి హక్కు కలిగియున్నది. కావునా పైన తెలిపిన నా క్లయింటు అయినటువంటి శ్రీ తాండవ రాజేష్ గారు సదరు శ్రీ గోళ్ళ నారాయణరావు గారి వద్ద క్రయం పొందుటకు నిశ్చయించుకుని టోకెన్ అడ్వాన్స్‌గా కొంత నగదును చెల్లించి క్రమమైన రశీదును పొంది యున్నారు. కనుక ఈ దిగువ షెడ్యూలు ఆస్థిపై ఎవరికైనా ఎట్టి క్లెయిములు గాని, అభ్యంతరములు గాని ఉన్న యెడల ఈ దిగువ అడ్రసుకు ప్రకటన తేదీ నుండి 07 (ఏడు) రోజులలోపు వ్రాత పూర్వకంగా తెలియజేయవలెను. దరిమిలా వచ్చు అభ్యంతరములు నా క్లయింటు యొక్క విక్రయలావాదేవీలను బైండు చేయజాలవనిన్నీ మరియూ ఈ ఆస్థిని నిష్పేచీగా భావింతురని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

ఎ-షెడ్యూలు: యన్. టి.ఆర్. జిల్లా (లోగడ కృష్ణాజిల్లా) విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ పరియాలో చేరిన, విజయవాడ టౌన్, విద్యాధరపురంలో యున్నట్టిన్నీ డి.నెం.47, న్యూ అసెస్‌మెంట్ నెం. 40624, డోర్ నెం.4-1-163రు దాఖలా చ.గ. 1306.8లు స్థిరాస్థికి హద్దులు: **తూర్పు:** మునిస్పిల్ రోడ్డు, **దక్షిణం:** సయ్యద్ అప్పలస్వామి కాలేజి వారి ఆస్థి, **పడమర:** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం:** సయ్యద్ అప్పలస్వామి కాలేజి వారి ఆస్థి - యీ హద్దుల మధ్య చ.గ. 1306.8 లు లేక చ.మీ.1092.65 లు స్థిరాస్థి నివేశన స్థలములో అవిభాజ్యపు, అనిర్ధిష్టపు జాయింటు హక్కుగల చ.గ. 30.0 లు లేక చ.మీ. 25.08 ర్లు స్థిరాస్థి నివేశన స్థలమున్నూ మరియూ బి-షెడ్యూలు: పైన తెలిపిన ఎ-షెడ్యూలు దాఖలా మొత్తము స్థలములో సర్దార్ ఆర్.యన్.యస్. టవర్స్ అను పేరుతో నిర్మించియున్న అపార్ట్‌మెంటు కాంప్లెక్స్‌లోని సెకండు ఫ్లోరులోని నెం.1 ప్లాటు కట్టడములకు హద్దులు: **తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టుస్కై- ఈ నాలుగు హద్దుల మధ్య చ.అ.1296.0లు ప్లింత్ ఏరియా (కామన్ ఏరియాతో కలిపి) మరియూ చ.అ.100.లు పార్కింగు హక్కుతోనూ సదరు అపార్ట్‌మెంటుకు సంబంధించిన కామన్ కారిడార్, లిఫ్ట్, జనరేటర్, కామన్ పార్కింగు, డ్రైనేజీ, కామన్ ఏరియా, కామన్ ఫెసిలిటీస్, జాయింటు దారులు, మోటారు వగైరాలందు మిగిలిన వారితో పాటు జాయింటు హక్కులతో సహా....

ఇట్లు
సి.యస్.యస్.ఆర్ వేణుగోపాల్, అడ్వకేట్,
26-20-15, 2వ ఫ్లోరు, స్వామి వీధి,
విజయవాడ-3. **Cell : 9848234515.**

తేదీ : 04-01-2023
స్థలము : విజయవాడ

మొదటి పేజీ తరువాయి

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అందరికీ భాగస్వామ్యం జగన్ ఘనతే

ప్రభుత్వాస్పత్రి రోడ్డు, మెయిన్ బజార్, 65వ నెంబరు జాతీయ రహదారి మీదుగా వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్, నందిగామ ఎఎంసి చైర్మన్ మస్తాన్, వైస్ చైర్మన్ నల్లమల్ల మురళీతోపాటు వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో జరిగిన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిథులుగా మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు, వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ కెవిఆర్ కళాశాలలో తన సహచరుడు, రైతు బిడ్డ, మైనార్టీ సోదరుడు మహమ్మద్ మస్తాన్ మార్కెట్ యార్డుకు చైర్మన్ కావడం సంతోషంగా ఉందన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పెద్దపెద్ద పదవులు, యార్డ్ చైర్మన్ వంటి పదదవులు కేవలం ఒక సామాజిక వర్గానికి మాత్రమే దక్కేవన్నారు. దీనికి భిన్నంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు ఉన్నత పదవులు ఇస్తూ, బిసిలను రాజ్యాధికారంలో భాగం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయం పట్టుకుందని, కుప్పంలో పిచ్చిపిచ్చి వేషాలు వేస్తున్నారని అన్నారు. పబ్లిసిటీ కోసం ఇరుకు సందుల్లో సభలు పెట్టి కందుకూరు, గుంటూరుల్లో 11 మందిని పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి, మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన పాలకవర్గం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, గెలుపునకు మహ్మద్ మస్తాన్ ఎనలేని కషి చేశారని, ఆ సేవలను గుర్తించి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి కట్టబెట్టిందని అన్నారు. ఎంఎల్ఎ మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాల ప్రమాణాలకు అనుగుణంగా సుస్థిరాభివద్ధిని సాధిస్తూ, సంక్షేమం, అభివద్ధిలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ప్రథమంగా నిలబెట్టారని అన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బరులకు రె...ఢీ

గట్టిగా ఒత్తిడి తెచ్చి మండలంలోని నున్నలో కోడి పందేల నిర్వహించాలని ప్రయత్నిస్తున్నారు. నున్న వికాస్ కాలేజీ రోడ్డులో రెండు మూడు తోటలను నాయకులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నున్నలో పండుగతో సంబంధం లేకుండానే నిత్యం కోడి పందేలు జరుగుతూనే ఉన్నాయి. నున్న రూరల్ పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలోనే పందేలు వేసినా ఎలాంటి చర్యలు లేవు. కాగా ఈసారి విజయవాడతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పందేల రాయుళ్లు వచ్చేందుకు వీలుగా రవాణా సౌకర్యం ఉండే తోటలను ఎంపిక చేయాలని నాయకులు భావిస్తున్నారు. నున్నలో కోడి పందేల నిర్వహణకు పోలీసుల నుంచి ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చూడాలని మండల, జిల్లా నాయకులను కోరినట్లు తెలిసింది. ఇదిలావుండగా నాయకులకు కూడా అంతా కలిసి పందేలు వేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. విజయవాడకు చెందిన వైసిపి నాయకులు నున్న, అంబాపురంలో కోడి పందేల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా నున్న - గుణదల రోడ్డులోని ఓ వెంచర్లో కోడి పందేల నిర్వహించేందుకు పార్టీ నేతలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నున్న, అంబాపురం వెంచర్లలో కోడి పందేలు వేస్తే, నున్న మామిడి తోటల్లో పందేల నిర్వహణ అనుమానమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే, నున్న నాయకులు మాత్రం తమకే అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత టిడిపి హయాంలో రెండుసార్లు కోడి పందేలు వేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఈసారి ఎట్టి పరిస్థితులలోనూ పందేలు వేసి తీరాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇదిలావుండగా కొత్తూరు తాడేపల్లి మామిడి తోటల్లోనూ పందేల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు ఈసారి కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రూరల్ మండల గ్రామాల్లో కోడి పందేలు వేసి తీరుతామని అధికార పార్టీ నాయకులు స్పష్టం చేస్తుండటం గమనార్హం.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జోగి, వెలంపల్లి

IN THE COURT OF THE XII ADDL. DISTRICT JUDGE, VIJAYAWDA
AS NO. 49/2016

Between
Boppana Seshukumar & another ... Appelents
and
N.Ramachandra Rao and 14 others ...Respondents

To,
R13 : నరహరిశెట్టి భారతీదేవి, W/o Late రామారావు, డోర్ నెం. 41-4-71/41, మెట్లబజారు, కృష్ణలంక, విజయవాడ.
R14 : నరహరిశెట్టి అఖిల్ చంద్, S/o Late రామారావు, డోర్ నెం. 41-4-71/41, మెట్లబజారు, కృష్ణలంక, విజయవాడ.
R15 : నరహరిశెట్టి అఖిలి D/o Late రామారావు, డోర్ నెం. 41-4-71/41, మెట్లబజారు, కృష్ణలంక, విజయవాడ.

పై నెంబరు గల అప్పీలులోని రెస్పాండెంట్లు R13, R14 & R15 అయిన మీరు పై కోర్టువారి ఎదుట హాజరు నిమిత్తం ది. 19-01-2023 నకు వాయిదా అయిఉన్నది. కావున మీరు ది. 19-01-2023న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల పై అప్పీలును మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వై.వి.కిషోర్‌బాబు,
అప్పీలెంట్స్ తరపున న్యాయవాది,
విజయవాడ.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం
ఒ.యస్. నెం. 32/2022

బిట్వీన్:
మల్లిన కృష్ణారావు -ప్లెయింటిఫ్
Vs
పునుకొల్లు శేషగిరిరావు -డిఫెండెంట్స్

పై నంబరు దావాలో శ్రీ కోర్టు వారు ప్రతివాది అయిన పునుకొల్లు శేషగిరిరావు, S/o. పాపారావు, డోర్ నెం. 3-5-9, రాజేంద్రనగర్, గుడివాడ, గుడివాడ మండలం, కృష్ణా జిల్లా అయిన వారికి Substituted Service ద్వారా సమన్లు అమలు చేయుటకు ఉత్తర్వులు ఇచ్చినారు. కావున ప్రతివాది **ది. 27-1-2023న ఉదయం 10.30 ని॥లకు** ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని హాజరై వారి అభ్యంతరములు తెలియజేయగలరు. లేని యెడల వారి పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

జి.కె.దుర్గాదేవి
వాది తరపు న్యాయవాది
తాడేపల్లిగూడెం, సెల్: 9985592776

నిరసనలో పాల్గొన్న నాయకులు

రైతు, కౌలు రైతు సంఘం ధర్నా

గుడ్లవల్లేరు : ధాన్యం కొనుగోళ్లలో నిబంధనల పేరుతో అధికార యంత్రాంగం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నందుకు నిరసనగా ఎపి రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో విన్నకోట రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. రైతు సంఘం నాయకులు డాక్టర్ రోపిచర్ల జ్యోత్స్న సత్యమూర్తి మాట్లాడుతూ ఆర్‌బికెల్లో తేమశాతాన్ని చూడకుండా, మిల్లర్లు తీసుకోకుండా అక్కడ వేరే మిషన్ పెట్టి వేరే తేమ శాతం వేస్తూ రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని అడ్డగోలుగా రేటు తెగ్గోస్తూ తిరిగి అదేరేటుకు ప్రభుత్వానికి అమ్ముకుంటున్నారని విమర్శించారు. కౌలురైతు సంఘం మండల ఉపాధ్యక్షులు దొడ్డి చిన్నారావు మాట్లాడుతూ ఇంతవరకు గోనె సంచులు ఇవ్వలేదన్నారు. కౌలురైతు సంఘం జిల్లా నాయకులు బి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రోపిచర్ల శేషాచార్యులు, ఏ.హరిబాబు, దొడ్డి రవి, పేర్ని బాబూరావు, పేర్ని మురళి, బెజవాడ నాగవిఘ్నేశ్వరరావు, కూనపురెడ్డి బైరాగి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రవీంద్ర భారతికి 44 స్వర్ణ పతకాలు

మచిలీపట్నం అర్బన్ : ఎ ా ధ ని క సుకర్లాబాదులోని నెల్లూరు రవీంద్ర భారతి స్కూలు విద్యార్థులు సైన్సు ఒలంపియాడ్‌లో స్వర్ణ పతకాల విజయ పరంపర కొనసాగించారు. జాతీయ స్థాయిలో జరిగిన సైన్సు ఒలంపియాడ్ పోటీ పరీక్షలలో నెల్లూరు రవీంద్రభారతి (బందరు శాఖ) విద్యార్థులు 119 మంది హాజరై 44 బంగారు పతకాలను సాధించారు. మరో 13 మంది విద్యార్థులు రెండో లెవల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ హరిణి మాట్లాడుతూ

బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్వర్ణపతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిషత్తులో మరిన్ని పతకాలు సాధించాలని కోరారు. విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం, మేధోశక్తిని పెంపొందించడంలో నెల్లూరు రవీంద్రభారతి ముందుంటుందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు శాస్త్రవేత్తలు కావాలన్న ఉద్దేశంతో యాజమాన్యం తగిన శిక్షణకు ఏర్పాట్లు చేసిందన్నారు. విద్యార్థులను ప్రపంచస్థాయికి పోటీపరీక్షల్లో పోటీపడేలా తగినట్లుగా సంసిద్ధులను చేస్తున్నామన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం శివరెడ్డి, డీన్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిఖర్జీని పర్యాటక కేంద్రంగా మార్చొద్దు

గుడివాడ : జార్ఖండ్ రాష్ట్రంలోని పవిత్రమైన శిఖర్జీ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చొద్దంటూ పట్టణంలోని జైనులు తమ కుటుంబ సభ్యులతో కలసి స్థానిక నెహ్రూచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జైన్ నాయకులు మాట్లాడుతూ తమకు ఎంతో పవిత్రమైన శిఖర్జీను పుణ్యక్షేత్రంగానే ఉంచాలన్నారు. జార్ఖండ్, కేంద్ర ప్రభుత్వం స్పందించే వరకు దేశవ్యాప్త నిరసనలు జరుగుతాయని తెలిపారు. జైన్ నాయకులు పాల్గొన్నారు.

గుడివాడలో నిరసన తెలియజేస్తున్న జైనులు

13 నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం

ఉమ్మడి కృష్ణాజిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13,14 తేదీల్లో గన్నవరంలో 37 వ సబ్ జూనియర్ ,44వ జూనియర్ బాలుర రాష్ట్ర అంతర జిల్లాల హ్యాండ్ బాల్ చాంఫియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు కె వి ఆర్ కిషోర్, జె.సింహాచలం వెల్లడించారు. గురువారం కె వి ఆర్ స్పోర్ట్స్ క్లబ్ ఆవరణలో జరిగిన విలేకరుల

మాట్లాడుతున్న కె.వి.ఆర్.కిశోర్, జె.సింహాచలం తదితరులు

సమావేశంలో పోటీల వివరాలను వారు ప్రకటించారు. పోటీలకు 15 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర హాండ్ బాల్ అసోసియేషన్ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీలు లీగ్ కం నాక్ అవుట్ పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఉచిత భోజన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలు గన్నవరం బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి జాతీయ పోటీలకు పంపుతామని వివరించారు. గన్నవరం వాకర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం, ఆటోనగర్ శ్రీ దుర్గా భవాని స్టీల్ కార్పొరేషన్, నవోదయ ట్రైనింగ్ సెంటర్‌తో పాటు స్థానిక దాతల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రెండురోజుల పాటు జరిగే ఈ పోటీలను స్థానిక ప్రజలు, క్రీడాకారులు తిలకించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి టి.శ్రీలత, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రాంబాబు, ఉపాధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, రాష్ట్ర బేస్ బాల్ సంఘం కార్యదర్శి టి.తులసీరావు, బేస్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ఎం.వి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఈనెల 8వ తేదీన గన్నవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హ్యాండ్ బాల్ జూనియర్, సబ్ జూనియర్ బాలుర జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని కెవిఆర్ కిషోర్, జె.సింహాచలం తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు సబ్ జూనియర్స్ విభాగంలో 2007,2008,2009లోనూ, జూనియర్ విభాగంలో 2004,2005,2006లో పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 8న ఉదయం 10 గంటల కల్లా హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు జి.రాంబాబు,ఆర్గనైజింగ్ కార్యదర్శి సెల్ : 9948776941లో సంప్రదించాలని కోరారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో శాఖల వారీగా అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. గురువారం సెక్రటేరియట్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. రీసర్వే, జాతీయ రహదారుల భూసేకరణ, జగనన్న ఇళ్లు, స్పందన అర్జీలు, వ్యవసాయం, ఉద్యానవన, పశు సంరక్షణ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరు తీరు, గడప గడపకు మన ప్రభుత్వం పనులు, చేయూత, జగనన్న తోడు, వైయస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా, స్వయం సహాయక సంఘాల రుణాలు వంటి అంశాలపై ఆయన జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా పురోగతిని వివరించడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ తెలిపారు. 2022-23 సంవత్సరపు రబీ సీజన్‌కు ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలన్నారు. ఆరుతడి పంటలుగా వేసిన మినుముతో పాటు ఇతర పంటలను నమోదు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవటానికి ఈనెల 15వ తేదీ వరకు

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

పొడిగించామన్నారు. డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్ఈ పీఆర్ ఈరాస్వామి, డిఆర్‌డిఏ పీడీ ప్రసాద్, సర్వే ఏడీ గోపాల్ రాజా, సీపీఓ వై. శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి మనోహరరావు, డ్వామా పీడీ జివి సూర్యనారాయణ, డిఎల్‌డిఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి వితరణ

మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విశ్రాంతి ఉద్యోగి వేమూరి శివనాగేశ్వరరావు రూ.20వేల వితరణతో గురువారం 40 మంది ఇంటర్ మొదటి తరగతి విద్యార్థినిలకు బూట్లు, సాక్షులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనందకుమార్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగి తన కష్టార్జితంలో కళాశాల విద్యార్థుల కోసం వితరణ అందించటం స్ఫూర్తిదాయకమన్నారు. మరో 71 రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయన్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు లంకిశెట్టి బాలాజీ విద్యార్థినులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనందకుమార్ కళాశాలలో అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

మహిళపై అత్యాచార యత్నం

కోడూరు : కోడూరు నుంచి మందపాకల వెళ్తున్న మహిళను దారి కాచి గుర్తు తెలియని వ్యక్తి అఘాయిత్యం చేసేందుకు పాల్పడ్డాడు. కోడూరులో బట్టల షాపులో పనిచేస్తున్న మహిళ షాపు మూయగానే బుధవారం రాత్రి తమ ఇంటికి మందపాకల బయలుదేరి ఒంటరిగా వెళ్తుండగా ఐబి పేట ధర్మ చెరువు సమీపంలో కతారి వారి పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మొహానికి మంకీ క్యాప్ పెట్టుకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను పట్టుకుని లాగాశాడు. ఆమె కిందపడగా లాక్కుని ముళ్ళ పొదల్లోకి తీసుకెళ్లి అఘాయిత్యం చేసేందుకు పాల్పడ్డాడు. మహిళ గట్టిగా కేకలు వేయడంతో ఆమె నోరు మూసి మొహంపై గాయపరిచి హతమార్చేందుకు ప్రయత్నించాడు. కేకలు వినబడి స్థానికులు పరుగున రాగా నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోడూరు ఎస్సై వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గాయపడిన మహిళను ప్రథమ చికిత్స నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

డిఎల్ఎస్ఎ కార్యదర్శి కృష్ణయ్య

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాజ్యాంగం కల్పించిన సమాన న్యాయం, సత్వర న్యాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.వి.ఆర్ కృష్ణయ్య చెప్పారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవా సదన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 1987లో న్యాయ సేవాధికార సంస్థ చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు. దీని ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ సమాన న్యాయంతో పాటు, సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లు

ఏర్పాటుచేశారన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమనే సూత్రాన్ని అనుసరించి లోక్ అదాలత్‌లలో కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకునే అవకాశం కల్గుతోందన్నారు. కృష్ణాజిల్లాలో గతేడాది 39,784 కేసులు లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించినట్లు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని అన్ని కోర్టుల పరిధిలో పెండింగ్ కేసులు పరిష్కారం చేసుకోవడానికి కక్షిదారులకు అవకాశం కల్పిస్తూ ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని రకాల సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్, చెక్ బౌన్స్, మోటారు వాహన ప్రమాద క్లయిములను పరిష్కరించుకోవచ్చన్నారు.

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉయ్యూరు

యుటిఎఫ్ ఉయ్యూరు మండల శాఖ ఆధ్వర్యంలో

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

2023 వార్షిక కేలండర్, డైరీని మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వరావు, మండల విద్యాశాఖాధికారిణి ఐ.పద్మరాణి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఉయ్యూరు మండల శాఖ అధ్యక్షులు పి.వి.రమణ, ప్రధాన కార్యదర్శి మోకా మాధవరావు, జిల్లా కౌన్సిలర్ కోసూరు శ్రీనివాస్, సహాధ్యక్షురాలు టి.స్వర్ణకుమారి. ఆడిట్ కమిటీ కన్వీనర్ వి.మాధవీలత, కార్యదర్శులు ఎం.బాబు, యు.హిరామ్ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

బండి రామకృష్ణ ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం 36వ డివిజన్లో ప్రమాదవశాత్తు చెట్టు మీద పడి మంచానికే పరిమితమైన కాగిత వీరబాబు కుటుంబానికి మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ రూ.10వేలు నగదు, నిత్యావసరాలు అందజేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వీరబాబు కూలికి వెళ్తే గాని ఇల్లు గడవని పరిస్థితని ఇద్దరు పిల్లలు ఉన్న విభిన్న ప్రతిభావంతులు కావడం (అంగవైకల్యం)తో వారు కదలలేని పరిస్థితి ఇటీవల భార్యకు గుండె సంబంధిత వ్యాధికి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. మానవతావాదులు, స్వచ్ఛంద సంస్థలు కాగిత వీరబాబు కుటుంబానికి ఆర్థిక చేయుత నిచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, రామ్ జ్యోతి, తోట రాజేష్, వేముల చక్రి, నరసింహ, మైకేల్, మణికంఠ, వీరబాబు కుటుంబ సభ్యులు, జనసైనికులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న బండి రామకృష్ణ

ఆందోళనలో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. నున్న ఎస్‌సి బాలికల హాస్టల్ దగ్గర గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.జి నుండి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతి గృహాలను మెరుగుపరుస్తామని, హాస్టల్స్‌కు సన్నబియ్యం సరఫరా చేస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ మెస్ ఛార్జీలు సరిపోక, నెలలు తరబడి పెండింగ్‌లో ఉండటంతో హాస్టల్ వార్డెన్లు చేతులెత్తేసే పరిస్థితులు వస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన మెనూ సైతం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. హాస్టళ్లలో కనీస సదుపాయాలులేవని, అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. హైస్కూల్ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.2 వేలు, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.3 వేలకు మెస్ ఛార్జీలను పెంచాలని, కాస్మోటిక్ ఛార్జీలను నెలకు బాలురకు రూ.250, బాలికలకు రూ.300కు పెంచాలని డిమాండ్ చేశారు.

'నల్లి'తో మిర్చి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-వత్సవాయి: మిర్చిని నల్లి తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది 20 వేల హెక్టార్లలో రైతులు మిర్చి పంట సాగు చేశారు. ఖమ్మంపాడు, వత్సవాయి, పోలంపల్లి, మక్కపేట, మంగోళ్ళు,

భీమవరం, కన్నెవేడు, చిట్యాల తదితరు గ్రామాల్లో మిర్చి పంటకు నల్లి రోగం సోకడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితిలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక ఎకరానికి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టామని వారు వాపోతున్నారు. మిర్చి పంట ఆశాజనకంగా ఉంటుందనుకున్న తరుణంలో నల్లి తెగులుతో మిరప తోట ఎదుగుదల ఆగిపోయి, ముడుచుకుపోయి ఎదుగుదల లోపించింది. ఎన్ని మందులు కొట్టినా తగ్గుముఖం పట్టడంలేదు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా మిర్చి పంట వేసిన రైతులకు నష్టాలే మిగిలాయన్నారు. గ్రామాల్లో సర్వే చేయించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండు చేశారు.

48వ డివిజన్లో మోటార్లు ఏర్పాట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: 48వ డివిజన్‌లోని బ్రహ్మం మఠం, వాగు సెంటర్ ఈద్గా మసీదుకు సంబంధించిన బూస్టర్లో మూడు కొత్త మోటర్లను గురువారం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో 48 డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి, ఇఇ నారాయణమూర్తి, డిఇ శివాజీ, ఎం.అహ్మద్, డివిజన్ వైసిపి అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, వరలక్ష్మి, బాయన అమర్నాథ్, గురుప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం చేతులమీదుగా సొసైటీ డైరీ ఆవిష్కరణ గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ నెంబర్ నల్లమోతు అనంతరాములు, సిసిఎస్ ప్రతినిధి సుబ్బారావు, సూపరింటెండెంట్ పివిరావు, డి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు పాల్గొన్నారు.

గులాబి ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్
పర్యావరణ పరిరక్షణలో రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యులు కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. నగరపాలక సంస్థ, హరిత ప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ, రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి అగ్రి ఆర్టి కల్చర్ షో, ఐదవ వార్షిక గులాబి ప్రదర్శనను కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ బెంగళూరు, కలకత్తా నగరాలలో ప్రదర్శనలో ఉండే పలు రకాల గులాబీలు ప్రదర్శనలో ఉంచడం జరిగిందన్నారు. నగరపాలక సంస్థ సహకారంతో నగరంలోనే వివిధ మొక్కలతో నర్సరీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజీవ్‌గాంధీ పార్కులో రకరకాల పూల మొక్కలను నాటి నగర ప్రజలకు కనువిందు చేస్తున్నామన్నారు. రానున్న మూడు నెలలో నగరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల 100 మిల్లింగ్టోనియా, జాఫ్రా వంటి పూల మొక్కలతో అందంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ప్రణాళిక రూపొందించిందన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ మాట్లాడుతూ నగర ప్రజలను కనువిందు చేసేలా నాలుగు రోజుల పాటు వివిధ రకాల గులాబీలు, పూలమొక్కలతో ప్రదర్శన ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. గార్డెన్ వరల్డ్, హైబ్రీడ్ చామంతుల గణపతి గార్డెన్, ఎస్‌విఆర్ గార్డెన్‌లలోని

పూలమొక్కలు, సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనలతో 70కి పైగా స్టాల్స్ సందర్శకులను కనువిందు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి మేరీ ప్రశాంతి, మాజీ ఎంపి, లైలా గ్రూప్ సంస్థ చైర్మన్ గోకరాజు గంగరాజు, రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు జిఎస్‌ఆర్ మోహన్‌రావు, సెక్రటరీ ఎన్.పద్మప్రియ పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. రామకష్ణాపురంలో రూ.80 లక్షల వ్యయంతో బుడమేరు వంతెన నుంచి దేవీనగర్ డీపీ స్టేషన్ వరకు నిర్మించిన నూతన ప్రధాన రహదారిని నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ గురునాథం, ఏఈ అరుణ్‌కుమార్, నాయకులు మార్తి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అలాగే 29వ డివిజన్ 209వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి,

అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జి.సుజనా, నాయకులు ఎస్.కె.బాబు, కోలా రమేష్ పాల్గొన్నారు.

వన్‌టౌన్లో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-వన్‌టౌన్: వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి నాయకులు పెందుర్తి శ్రీనివాస్, ఎమ్ఎస్ బేగ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఒ 1 కాపీలను దహనం చేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వ పాలన తీరును ఇంటింటికి తిరుగుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో సుకాశీ కిరణ్, నీలం మనోజ్‌బాబు, నీలం వెంకట నారాయణ, షేక్ గాలిబ్ సాహెబ్, సుకాసి సరిత, మొండి జ్యోతి, కొట్టేటి సరిత, కోసన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎడెల్ వైజ్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి రామ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రజలకు అవగాహణ కల్పించడంతో పాటు ఆరోగ్య రంగానికి ప్రధాన్యత ఇచ్చే విధంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ముఖ్యంగా అవయవదానం ఎంత ముఖ్యమో తెలియచేయడమే ఈ కార్యక్రమం ప్రదాన ఉద్దేశమన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రధాన నగరాలలో అవగాహన కల్పించేందుకుగాను ఎన్జీవో మోహన్ ఫౌండేషన్‌తో కలిసి నిర్వహిస్తున్నామని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: అఖిల భారత చెవి, ముక్కు, గొంతు వైద్యుల సంఘం విజయవాడ శాఖ ఎన్నికైంది. నగరంలోని ఐఎంఎ హాల్‌లో సంఘం

విజయవాడ శాఖ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా పి.శ్వేత, ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ ప్రదీప్, కార్యదర్శిగా డాక్టర్ కెఎస్ఆర్ భార్గవ, సహ కార్యదర్శిగా డాక్టర్ పవన్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ షమీర, కార్య నిర్వహణ కమిటీ సభ్యులుగా డాక్టర్ సుధ, డాక్టర్ అఖిలా సుల్తానా, డాక్టర్ వెంకయ్య డాక్టర్ దినేష్ ఎంపికయ్యారు.

ట్యాబ్‌ల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ట్యాబ్‌లు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్‌తో రూపొందించిన ట్యాబ్‌ల పనితీరు, విద్యార్థులు ఉపయోగిస్తున్న విధానాన్ని గురువారం బిషప్ అజరయ్య బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న 14 వేల మందికిపైగా విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశామన్నారు. అన్ని పాఠ్యాంశాలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వీడియో, ఆడియో, త్రీ డైమన్షన్‌తో బోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని కార్పొరేట్ విద్యార్థులతో పోటీ పడే విధంగా ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి విద్యార్థులు రానున్న పబ్లిక్ పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టి పట్టుదలతో ఏకాగ్రతతో అన్ని సబ్జెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

మేథో సంపత్తి హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యార్థులు మేథో సంపత్తి హక్కులపై అవగాహన

పెంచుకోవాలని కెఎల్ విశ్వవిద్యాలయం పెటెంట్ ఫెసిలిటేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రాఘవరావు అన్నారు. కెబిఎన్ కళాశాల మ్యాథ్‌మెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'మేథో సంపత్తి హక్కులు' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ మేథో సంపత్తి మానవ తెలివితేటలకు సంబంధించిన ఆస్తిగా భావించాలన్నారు. మేథస్సు లేదా తెలివితేటల ద్వారా మానవులు సష్టించిన వస్తువులు, ఇతర కష్టార్జితంపై అన్ని హక్కులు వాటి సష్టికర్తకే ఉంటాయన్నారు. కాపీరైట్, పేటెంట్లు, ట్రేడ్ మార్కులు, ట్రేడ్ సీక్రెట్లు వంటివన్నీ విభాగంలో ఉన్నాయన్నారు. న్యాయ వ్యవస్థలో దీనికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అధ్యాపకులు లక్ష్మీప్రసన్న, సిహెచ్ రాధిక, డాక్టర్ పీ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మేద్ శిఖర్జీని టూరిస్ట్ స్పాట్‌గా మార్చొద్దు

ప్రజాశక్తి-వన్‌టౌన్: జార్ఖండ్ రాష్ట్రంలోని జైన్‌ల పవిత్ర స్థలం సమ్మేద్ శిఖర్జీని టూరిస్ట్ ప్రాంతంగా మార్చవద్దంటూ గురువారం విజయవాడ జైన్ సంఘ్ ఆధ్వర్యంలో వేలాది మంది జైనులు తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జైన్ పెద్దలు కలెక్టర్‌తో మాట్లాడుతూ శిఖర్జీ ఎంతో పవిత్ర స్థలమని, ఆ ప్రాంతాన్ని టూరిస్ట్ స్పాట్‌గా మార్చితే ఆ ప్రాంతం మరోవిధంగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జైనుల మనోభావాలను గమనించి శిఖర్ పవిత్రతను కాపాడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జైన్ సమాజ్ పెద్దలు పన్నాలాల్ జైన్, భన్వర్‌లాల్ జైన్, సంజయ్‌కుమార్ మెహతా, దినేష్ జైన్, రాజు సోలంకి, సంజయ్ జైన్, మనోజ్ కొఠారి, ప్రవీణ్‌జైన్ రాంకా, సందీప్ కాంకేరియా, భోగిలాల్, మహేందర్‌జైన్, మిల్టన్ జైన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు మహా ప్రదర్శనగా వెళ్తున్న జైనులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.